



కలెక్టరేట్‌లో బోనాలతో మహిళా సిబ్బంది



డ్యాన్స్ చేస్తున్న మహిళా సిబ్బంది



కలెక్టరేట్‌లో బోనాల సందడి

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా ఉద్యోగులు బోనమెత్తారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య దుర్గామాత ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. దుర్గామాతకు దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని, అన్ని వర్గాల వారికి మేలు చేకూరేలా చూడాలని అమ్మవారిని ప్రార్థిస్తూ మొక్కులు చెల్లించారు.

- రంగారెడ్డి అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి)





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి పాండురంగారెడ్డి

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

» ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శేరిగూడ, నాగన్‌పల్లి, పోల్కంపల్లి, దండుమైలారం, రాయపోల్, ఇబ్రహీంపట్నం బాలికల పాఠశాలలో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెండేళ్లుగా జీపీఎఫ్, సరెండర్, సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను సంవత్సరానికి రూ.700 కోట్లు చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలను చేపట్టి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. 2008, 2024కు చెందిన డీఎస్సీ ఉపాధ్యాయులకు ఆరు నెలలుగా జీతాలు రాలేదని, వారికి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస పే స్కేల్ అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, రవికుమార్, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్షుడు కురుపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ వాయిదాలను కేంద్రం 55 శాతం, జప్తు చేసిన అన్ని డీఏలతో సమానంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. పెన్షనర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు అన్ని ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్సను నిర్ధారించేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ గౌవర అధ్యక్షుడు బాలచందర్, అధ్యక్షుడు కురుపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, ఫైనాన్స్ సెక్రటరీ భాస్కర్, రాజు పాల్గొన్నారు.



బస్సుకోసం చెన్నారెడ్డిగూడలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బస్సు సర్వీసులు పెంచాలి

మంచాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): బస్సు సర్వీసులు పెంచాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం చెన్నారెడ్డిగూడలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నేత స్వామి మాట్లాడుతూ ఉదయం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం 7.30కు బండలేమూర్ నుంచి వచ్చే బస్సు అక్కడే కిక్కిరిసిపోతోందని, బస్సులో స్థలం లేక చెన్నారెడ్డిగూడలో విద్యార్థులకు బస్సెక్కలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆ తర్వాత 10.30 వరకు బస్సు సర్వీసు లేదన్నారు. ఉదయం 8 గంటలకు చెన్నారెడ్డిగూడకు బస్సు సర్వీసును నడపాలని కోరారు. సీపీఎం నాయకులు చంద్రయ్య, వెంకటేష్, పాండు, ప్రహ్లాద్, పి.కృష్ణ, ప్రవీణ్, ఏ.యాదయ్య, పి.జంగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సర్కారు బడికి జై

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, ఉత్తమ బోధన అందిస్తుండడంతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు జోరుగా పెరిగాయి. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఈసారి 36,579 కొత్తగా అడ్మిషన్లు జరిగాయి. ప్రైవేట్ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరు

బడిబాటలో 36,579 మంది విద్యార్థుల చేరిక

మెరుగైన సౌకర్యాలు.. ఉత్తమ బోధన

ఇంగ్లిష్ మీడియంలో తరగతులు

ఆకర్షితులవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రంగారెడ్డి అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,342 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1,40,171 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌తోపాటు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ డ్రెస్, మధ్యాహ్న భోజనం, బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు వంటి అనేక రకాలైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీనికి తోడు బడిబాటలో సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధనపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో ఈ ఏడాది మొత్తం 36,579 కొత్త అడ్మిషన్లు జరిగాయి. ఇందులో ఒకటో తరగతిలో 8,203, రెండో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రైవేట్ బడుల నుంచి ప్రభుత్వ బడుల్లోకి 15,222, ప్రాథమిక, ప్రాథమికోన్నత నుంచి ఉన్నత పాఠశాలల్లో 13,154 మంది చేరారు. అలాగే ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దగ్గరలో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించారు. విద్యార్థులకు టెక్ట్స్‌బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరు పాఠశాలల్లో రెట్టింపు స్థాయిలో..

జిల్లాలోని ఆరు పాఠశాలల్లో అనుకున్న దానికంటే రెట్టింపు స్థాయిలో విద్యార్థులు చేరారు. ఆరుట్ల పాఠశాలలో

మిగతా 8వ పేజీలో...

జిల్లాలోని పాఠశాలల వివరాలు

పాఠశాలలు	1,342
విద్యార్థులు	1,40,171
ఒకటో తరగతిలో అడ్మిషన్లు	8,203
ప్రైవేటు నుంచి చేరికలు	15,222
మిగతా ప్రవేశాలు	13,154
మొత్తం అడ్మిషన్లు	36,579





అడ్మిషన్లు పెరిగాయి

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నాం. నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. బడిబాట కార్యక్రమంలో 36,579 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు అడ్మిషన్లు తీసుకున్నారు.

- సుశీంద్రరావు, జిల్లా విద్యాధికారి

దాడుల సంస్కృతిని రూపుమాపాలి

» తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మీడియాపై జరుగుతున్న దాడుల సంస్కృతిని రూపుమాపడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఖాజా పాషా కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో మంగళవారం బక్కని పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మీడియాపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఓ న్యూస్ చానల్, తీన్మార్ మల్లన్న ఆఫీసుపై, చిత్తూరులో ఏబీఎన్ ఫొటోగ్రాఫర్‌పై దాడులు చేశారని గుర్తు చేశారు. దాడుల సంస్కృతి షాద్‌నగర్‌కు పాకడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్రంగా విచారణ చేయాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడులను కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, రఘునాయక్, కొంకళ్ల చెన్నయ్య, బాదేపల్లి సిద్ధార్థ, జాంగారి రవి, బీఆర్ఎస్ నాయకుడు ఏజాజ్, కార్మిక సంక్షేమ సంఘం నాయకుడు పినపాక ప్రభాకర్, కృష్ణ ప్రజాసేన నాయకుడు ఖాదర్‌ఘోరి, తదితరులు ఖండించారు.

ఓటరు జాబితాను పక్కాగా చేపట్టాలి

» చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను పక్కాగా చేపట్టాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చేవెళ్ల మండలంలోని బీఎల్‌వోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల అధికారుల ఆదేశాలకనుగుణంగా గ్రామాల్లో ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. చేవెళ్ల మండలంలో 64 బూత్‌లు ఉన్నాయని, బూత్‌ల వారీగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు పక్కగా చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా సందేహాలుంటే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎన్నికల అధికారులు కృష్ణయ్య, పాండు, శిక్షకులు ఆశీర్వాదం, అక్బర్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

పాములతో జరభద్రం

పొలం పనుల్లో అప్రమత్తంగా ఉండాలి
కాటేస్తే మంత్రాలు,
పసరు వైద్యంతో ప్రాణాలకు ముప్పు
వైద్యుడిని సంప్రదించడం శ్రేయస్కరం

7

ఈజీఎస్ పనులు పారదర్శకంగా చేపట్టాలి

అక్రమాలకు తావివ్వొద్దు
డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత
కద్దాలలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

6



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

భూసార పరీక్షలు చేయించుకోవాలి

» జిల్లా వ్యవసాయాధికారి ఉష

మహేశ్వరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవడంతోపాటు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మంగళవారం మహేశ్వరం రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రైతులు క్రమంగా సేంద్రియ ఎరువుల వైపు దృష్టి సారించాలన్నారు. వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు కావాలన్నారు. సాగు పద్ధతులపై ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్వరం డివిజినల్ వ్యవసాయాధికారి సుధారాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి, యాదగిరిగౌడ్, శ్రీవిద్య పాల్గొన్నారు.

పాలమూరు ఎత్తిపోతల నిర్మాణమెప్పుడు?

» సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు జంగయ్య

చౌదరిగూడ, జూలై 15(ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి కొందుర్గు మండలంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎప్పుడు నిర్మిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రశ్నించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో మండల మహాసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కొందుర్గు మండలంలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే 12 మండలాలకు సాగు నీరందుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంపై కాలయాపన చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు ఊసేలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దుల జంగయ్య, వెంకటేష్, బాల్‌రాజ్, షబ్బీర్, చంద్రయ్య, అనిత, యాదయ్య, పద్మ, లక్ష్మీ, రాములు, వీరేష్, లింగమయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

దోమ, జూలై 15(ఆంధ్రజ్యోతి): అయినాపూర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఇటీవల గ్రామస్తులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కోరారు. మంగళవారం గ్రామస్తులు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్‌గౌడ్, సర్దార్, జహంగీర్, ఖదీర్ ఉన్నారు.


వినతిపత్రం ఇస్తున్న అయినాపూర్ గ్రామస్తులు

జుంటువాగు కబ్జాను అడ్డుకోరా?

- బఫర్‌లో గదుల నిర్మాణం
- హద్దులు చెరిపి మరీ వాగు ఆక్రమణ
- చర్యలకు అధికారుల మీనమేషాలు

బషీరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జుంటువాగు కబ్జా, బఫర్ జోన్‌లో నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తాండూరు-బషీరాబాద్ రోడ్డులో గల జుంటువాగులో కబ్జా చేశారని కొన్ని రోజుల కింద అధికారులు హద్దులు పాతారు. అయితే ఓ భూ యజమాని హద్దుల తొలగించి నిర్మాణం చేపడుతున్నాడు. జుంటువాగు కబ్జాపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకరప్రసాద్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో గత గురువారం యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, ఏఈ భానుప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఐ శివచరణ్, సర్వేయర్, సిబ్బంది వాగును సందర్శించి వాగుకబ్జా, గదుల నిర్మాణం నిజమేనని తేల్చారు. అధికారులు అప్పటికప్పుడు సర్వేచేయించి హద్దులు పాతించారు. చెక్‌డ్యామ్ వింగ్‌వాల్‌ను కూల్చి బఫర్‌లో భూ యజమాని గదులు నిర్మిస్తున్నాడని తేల్చారు. అధికారులు భూ యజమాని గోపాల్‌తో మాట్లాడి బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాన్ని కూల్చాలని ఆదేశించారు. ఇందుకు గోపాల్ సరేనని పోసిన మట్టిని తొలగిస్తానని అధికారులను నమ్మించాడు. ఆ తర్వాత ఇటువైపు ఎవరూ రాకపోవడంతో గోపాల్ నిర్మాణాన్ని కొనసాగిస్తూ గదులకు పైకప్పు పూర్తి చేశాడు. అక్రమ నిర్మాణంపై చర్యలకు అధికారులు వెనకడుగు వేస్తున్నారని గ్రామ రైతులు ఆరోపణలొస్తున్నాయి. ఈ విషయమై యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్యల స్పదన కోరగా.. గదులు నిర్మించిన భూమి తాండూరు రెవెన్యూలోకి వస్తుందన్నారు. వాగు కబ్జా, బఫర్‌లో గదుల నిర్మాణంపై తాము ఇప్పటికే కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. గదుల నిర్మాణంపై తాండూరు తహసీల్దారే చర్యలు తీసుకుంటారని వారు చెప్పుకొచ్చారు.


జుంటువాగు బఫర్‌లో నిర్మిస్తున్న గదులు

జొన్నల డబ్బులు చెల్లించండి సారూ..

40రోజులుగా అందని జొన్నల డబ్బులు

బంట్వారం జూలై 15(ఆంధ్రజ్యోతి): జొన్నల డబ్బులు చెల్లించండి సారూ.. అని మండల రైతులు కోరుతున్నారు. గత యాసంగిలో పండించిన జొన్నలను నెల రోజుల క్రితం మర్పల్లి ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల్లో వివిధ గ్రామాల 40 మంది రైతులకు విక్రయించారు. 15రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్పారు. 40రోజులవుతున్నా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయలేదు. దీంతో రైతులు వానకాలం పంట పెట్టుబడులకు, పిల్లల స్కూలు ఫీజులకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. జొన్నల డబ్బులు పంట పెట్టుబడికి వస్తాయనుకుంటే ఇంకా ఖాతాల్లో వేయడం లేదని రైతులు ఆదోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మినా వెంటనే డబ్బులిచ్చేవారని వాపోతున్నారు. విత్తనాలు, ఎరువులకు వడ్డీకి అప్పులు తీసుకున్నామని చెబుతున్నారు. 15 రోజుల్లో ఖాతాల్లో డబ్బులు చేస్తామని అధికారులు చెప్పడంతోనే కొనుగోలు కేంద్రాల్లో జొన్నలను విక్రయించామంటున్నారు. అధికారులిచ్చిన రశీదులతో ఇప్పుడు వారి వద్దకు వెళ్తే.. 'మాకేం తెల్వదు. ప్రభుత్వం ఎప్పుడు వేస్తే అప్పుడే మీ ఖాతాల్లో డబ్బులు పడుతాయి.' అని చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే తమ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని జొన్నల రైతులు కోరుతున్నారు.


రైతుకు కొనుగోలు కేంద్రంలో ఇచ్చిన రశీదు

ఈజీఎస్ పనులు పారదర్శకంగా చేపట్టాలి


సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న పీడీ శ్రీలత

కడ్తాల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి పారదర్శకంగా చేయాలని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత సూచించారు. పనుల్లో పొరపాట్లకు, అక్రమాలకు తావివ్వొద్దని మండల అధికారులు, సిబ్బందికి సూచించారు. కడ్తాల రైతు వేదికలో మంగళవారం ఉపాధి హామీ నాలుగో విడత సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. ఎంపీడీవో సుజాత అధ్యక్షత వహించారు. పీడీ, ఏపీడీ సుభాషిణి హాజరయ్యారు. 2024-2025లో 24 పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. చేపట్టిన పనులు, నిధుల ఖర్చు, కూలీలకు చెల్లింపులపై పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఈజీఎస్ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి నాణ్యతగా చేయాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. పొరపాట్లకు, అక్రమాలకు తావివ్వొద్దని సూచించారు. మొక్కలు ఎండకుండా సంరక్షించాలని సిబ్బందికి ఆదేశించారు. అక్రమాలకు తావిస్తే రికవరితో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో లాలయ్య, ఏపీవో లలిత, ఏపీఆర్ పరమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని పీడీకి వినతి

నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు కలుగుతున్నాయని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది డీఆర్డీఏ పీడీ శ్రీలతకు తెలిపారు. పీడీ, ఎంపీడీవోలకు వారు వినతి పత్రాలు అందజేశారు. నెలల పాటు వేతనాలందక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరారు.కార్యక్రమంలో ఈజీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, శ్రీను, బి.సత్తయ్య, యాదగిరి, రమేశ్, లక్ష్మణ్, సువర్ణ, బేగం పాల్గొన్నారు.

యాదయ్యగౌడ్ సేవలు మరువలేనివి

మహేశ్వరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి దివంగత డాక్టర్ తూళ్ల యాదయ్యగౌడ్ చేసిన సేవలు మరిచిపోలేనివని మాజీ హోం మంత్రి టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. మహేశ్వరం గేటు సమీపంలో పది ఎకరాలు భూమిని జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు విరాలంగా ఇచ్చిన మహానుభావుడు యాదయ్యగౌడ్ అన్ని అన్నారు. ఆయన విగ్రహాన్ని పాఠశాల ప్రాంగణంలో మంగళవారం దేవేందర్‌గౌడ్, తన కుటుంబసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నాడు ముందు చూపుతో రూ.2వందల కోట్ల విలువ చేసే భూమిని పేద విద్యార్థుల కోసం విద్యాలయం ఏర్పాటు చేయాలనే విరాలంగా ఇచ్చారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధి, ఇతరాల కోసం యాదయ్యగౌడ్ కుటుంబీకులు రూ.10లక్షల డబ్బును పాఠశాల ఖాతాలో జమ చేయడం మామూలు విషయం కాదన్నారు. ఇక్కడ చదువుతున్న ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహేశ్వరం ప్రాంతం ఎప్పటికైనా ప్రపంచ రికార్డుల్లో స్థానం పొందాలని యాదయ్యగౌడ్ ఎప్పుడూ ఆలోచించేవారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తూళ్ల కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యాదయ్యగౌడ్ సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు కిషోర్, టి.వినోద, విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.


యాదయ్యగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

ఆమనగల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండ చూడాలని కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శివశంకర్‌తో కలిసి శంకర్ సందర్శించారు. కళాశాల ఆవరణ, గదులను పరిశీలించి విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక ఇబ్బందులు కలుగుతున్నాయని, అసంపూర్తి భవన నిర్మాణ పనులు పూర్తిచేయించాలని విద్యార్థులు కోరారు. భవన నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని భూ వివాదాన్ని పరిష్కరించి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని శంకర్ కోరారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు చెట్లకింద తరగతులు తప్పడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తికావడం లేదని విచారం వ్యక్తం చేశారు. డిగ్రీ, జూనియర్ కాలేజీలకు భవనాలు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సాయికుమార్, డీవైఎఫ్ఐ శివశంకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

అందుబాటులో 438 టన్నుల యూరియా


మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాండూరులో రైతులకు 438 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తాండూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రుద్రమూర్తి తెలిపారు. మంగళవారం తాండూరులోని శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరులో యూరియా కొరత లేదన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తాండూరు మండలంలో 162 టన్నులు, బషీరాబాద్‌లలో 125 టన్నులు, యాలాలలో 98టన్నులు, పెద్దేముల్‌లోనూ యూరియా అందుబాటులో ఉందన్నారు. తాండూరు ప్రాంత అన్ని మండలాల్లో డీఏపీ 98 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు బషీరాబాద్‌లో 117 టన్నులు, తాండూరులో 226 టన్నులు, పెద్దేముల్‌లో 52 టన్నులు, యాలాలలో 26 టన్నులు ఉందని వివరించారు.

ఏడీఏ రుద్రమూర్తి బదిలీ

తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇక్కడ మూడున్నరేళ్లపాటు పనిచేసిన రుద్రమూర్తి ఆసిఫాబాద్ జిల్లా కార్యాలయానికి డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. త్వరలోనే ఆయన తాండూరు నుంచి రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

రైతులకు ఉపయోగపడేలా సహకార సంఘాలు పని చేయాలి

రాజేంద్రనగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకారం పరపతి సంఘాలు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో 311ఎఫ్‌పీఓలతో నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం ఒకటి లేదా రెండు సేవలకు పరిమితం కాకుండా, రైతులకు సంబంధించి అన్ని సేవల రూపకల్పనలో పాలుపంచుకుంటే ఆర్థిక పరిపుష్టితో పాటు రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. సహకార రంగంలో దేశవ్యాప్తంగా రోల్ మోడల్‌గా నిలిచిన ముల్కనూరు సహకార పరపతి సంఘ విజయాల్ని ప్రస్తావిస్తూ.. సహకార సంఘ బాధ్యతలు నీతిగా, నిజాయితీగా నిర్వహిస్తే ఇలాంటి సహకార సంస్థలు మరిన్ని ఉద్భవిస్తాయని చెప్పారు. సహకార సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా' మార్చి వారికి మరింత ఆర్థిక తోడ్పాటు అందించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్‌ను బిజినెస్ ఆర్గనైజేషన్‌గా నియమించి 311 సంఘాలను ఎఫ్‌పీఓలుగా ఎన్నిక చేశామని చెప్పారు.



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న చంద్రశేఖర్

డిమాండ్ల సాధనకు పీఆర్‌టీయూ పోరాటం

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ అవిశ్రాంత పోరాట ఫలితంగానే ఉపాధ్యాయులకు అప్రెంటిస్‌షిప్ రద్దయిందని, నోషనల్ ఇంక్రిమెంట్లు, లేడీ టీచర్లకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరయ్యాయని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం శివారెడ్డిపేట జెడ్పీ, వికారాబాద్ జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో ఆయన యూనియన్ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారానికి 52ఏళ్లుగా పీఆర్‌టీయూ పోరాటం చేస్తోందన్నారు. రాజకీయ పార్టీలకు అనుబంధంగా కాకుండా ఉపాధ్యాయుల సంక్షేమానికే కృషిచేసే సంఘం పీఆర్‌టీయూ అని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల నియామకం, 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు, మెటర్నిటీ, పెటర్నిటీ లీవులు కూడా పీఆర్‌టీయూ సాధించిన విజయాలేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేదార్‌నాథ్, పట్నం రాఘవేందర్, గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, జీహెచ్‌ఎంలు శ్రీశైలం, జనార్ధన్ రెడ్డి, జిల్లా, రాష్ట్ర బాధ్యులు రమేష్ షిండే, వీరేశం, జహంగీర్, యాదగిరి, వేణుగోపాల్, శ్రీనివాస్, రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న పవన్‌కుమార్

మూడుచింతలపల్లి, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో మంగళవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన రోడ్లు, వార్డు కార్యాలయాలు, ఆలయాల వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. కేశవరంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ యునైటెడ్ వే స్వచ్ఛంద సంస్థ సిబ్బందితో పర్యటించి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. డ్రై అండ్ వెట్ వేస్ట్ విషయమై చర్చించారు. వర్షాలు పడగానే మొక్కలు నాటుతామని అధికారులు పేర్కొన్నారు.



ప్రభుత్వ భూమి హద్దులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమి పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కాచవాని సింగారం పరిధి సర్వే నంబర్ 66లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. కబ్జా విషయమై పలుమార్లు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి హద్దురాళ్లను తనిఖీ చేశారు. త్వరలో పూర్తిస్థాయిలో డిజిటల్ సర్వే చేస్తామని రెవెన్యు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్లు బలిరామ్, సత్యమ్మ, రూప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కులకచర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. వంట గది, కూరగాయలు నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. కూరగాయలతో ఆహారం వండి విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి ఘన సన్మానం



అదనపు ఎస్పీ హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా సేవలందించిన టీవీ.హనుమంతరావు రాచకొండ కమిషనరేట్‌కు బదిలీపై వెళుతున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. హనుమంత్‌రావు నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో గొప్పగా సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పీవీ.మురళీధర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించం

యాలాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ హెచ్చరించారు. రాస్నం కంపార్ట్‌మెంట్ నెంబర్-112లోని అటవీ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అటవీ భూమి పరిరక్షణకు తవ్విన కందకాన్ని కొందరు చదును చేసి రోడ్డులా మార్చారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో హెచ్చరించారు. సర్వే నంబర్-33, 152ల రైతుల పొలాలకు వెళ్లేందుకు బాట వేసుకున్నట్టు గుర్తించారు. దీంతో రేంజర్ బాటపై మరోసారి కందకాన్ని తవ్వించారు. రాస్నంలో కొందరు రైతులు అటవీ భూమి దున్నేస్తున్నారని చెప్పారు. తమ పేరిట ఉన్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు అటవీ భూమిని స్వచ్ఛందంగా వదిలేయకుంటే నోటీసులిస్తామని హెచ్చరించారు. అటవీ, వన్య ప్రాణుల మనుగడకు ప్రజలు సహకరించాలని ఎఫ్ఆర్వో కోరారు.



రష్మికకు స్వామి వారి ప్రతిమను అందజేస్తున్న చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు

వేంకటేశ్వరుడి సేవలో

సినీ నటి రష్మిక

కందుకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరు గ్రామంలో వెలసిన ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రముఖ సినీ నటి రష్మిక మందన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆమెతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు రష్మికను ఘనంగా సన్మానించారు. రష్మిక మాట్లాడుతూ ఆలయానికి ఘనమైన చరిత్ర ఉందని, స్వామివారిని నమ్ముకున్న వారికి కొంగుబంగారంలా వరాలిస్తాడని అన్నారు. తాను కూడా వేంకటేశ్వరస్వామిని నమ్ముకొని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఆమెతో ఉన్నారు.



ఘనంగా సీత్లా వేడుక

ఘట్‌కేసర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీత్లా అమ్మ వారిని కొలిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని, పశుపక్ష్యాదులు, జీవులు వ్యాధులబారిన పడవని ఎన్ఎఫ్‌సీ నగర్ గోర్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్‌రాములు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని బ్యూటినెస్ట్ కాలనీలో మంగళవారం సీత్లా పండుగ సందర్భంగా సీత్లా భవాని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చెన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మణ్‌నాయక్, బానుక వాల్యా నాయక్, పూజారి మోతీలాల్ నాయక్, పురుషోత్తమ్ నాయక్, డీజీ నాయక్ పాల్గొన్నారు.

పాములతో జరభద్రం..

పొలం పనుల్లో అప్రమత్తంగా ఉండాలి

- పాము కాటేస్తే మంత్రాలు, పసరు వైద్యంతో ప్రాణాలకు ముప్పే
- వైద్యమే శ్రేయస్కరం.. యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్ తప్పనిసరి





బషీరాబాద్/కొడంగల్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి):వర్షాకాలంలో అన్ని ప్రాంతాల్లోనూ పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పొలాలు, పొదలు, మరుగు ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లలో సర్పాలు ఎక్కువ సంచరిస్తాయి. వేసవి తాపం నుంచి సేదదీరేందుకు పాములు, ఇతర విషకీటకాలు పుట్టలు, పొదల్లోంచి బయటకు వస్తుంటాయి. సాధారణంగా పొలం పనుల్లో రైతులు, కూలీలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. అలాగే సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్ల విద్యార్థులకు సైతం సర్పాల ప్రమాదం పొంచి ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, తేళ్లు, ఇంగ్లీకాలు, జెర్రిలు వంటి విషకీటకాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ధాన్యపు గాదెలు, ఒందలు, పొలం గట్లు, సొప్ప కుప్పలు, గడ్డివాముల్లో ఉండే కప్పలు, ఎలుకలను తినేందుకు పాములు వస్తుంటాయి. మరుగు ప్రదేశాల్లో పాములు గుడ్లుపెట్టి పిల్లలు చేస్తాయి. ఇలాంటి ప్రదేశాల్లో సంచరించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రాత్రి సమయాల్లో ఇటువైపు అస్సలు వెళ్లొద్దు. వెళ్లాల్సి వచ్చినా టార్చ్‌లైట్ తప్పక తీసుకెళ్లాలి. ఇళ్లలో ఎక్కడా చెత్త చెదారం పేరుకోకుండా చూసుకోవాలి. గదుల్లో చీకటి లేకుండా చూసుకోవాలి. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిచ్చిమొక్కలు, చెత్త ఉండనీయొద్దు. ఇళ్ల కిటికీలకు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా పాముకాటుకు గురైతే నాటు వైద్యం, మంత్రాలను ఆశ్రయించకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకుపోవాలి. పాముకాటు విరుగుడుకు వైద్యులు 'యాంటీ స్నేక్ వీనమ్' ఇంజక్షన్ ఇస్తారు.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే...

పొలం/కాలువ గట్లు, పశువుల కొట్టాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇళ్లు, కట్టెలు, పెంట దిబ్బల్లో పాములు తిష్టవేస్తూ బల్లులు, తొండలను తింటుంటాయి. స్టార్టర్ బాక్సుల్లోనూ పాములు చుట్టుకొని పంటాయి. బాక్సుల డోర్లు తీసే సమయంలో జాగ్రత్తగా గమనించాలి. పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు, వాటి ఏకాంతానికి భంగం కలిగినపుడు, తొక్కినప్పుడు క్షణ కాలంలో కాటేస్తాయి.

సర్పం కరిస్తే ఆలస్యం చేయొద్దు

పాముల్లో చాలా వాటికి విషముండదు. తాచుపాటు, నాగుపాము, కట్లపాము, శెడుగు, శెట్టిర్కపాటు వంటి కొన్ని రకాల పాములు అత్యంత విషపూరితమైనవి. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది. వైద్యం అందకుంటే రెండు గంటల్లోపే ప్రాణాపాయం ఉంటుంది. బాధితుడ్ని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి. నాగుపాము కాటేసిన 15 నిమిషాల్లోనే మనిషికి విషం ఎక్కుతుంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. రక్త పింజర, కట్ల పాము కాటేసిన రెండు గంటల్లోగా విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్ట కాటేసినా ఏమీ కాదు. వాటికి విషం ఉండదు. అయితే పాము ఏదైనా కరిచిన వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలి.

విషం ఎక్కితే ఇలాంటి లక్షణాలుంటాయి..

విషపూరిత పాము కాటేస్తే మనిషి శరీరం నీలంగా మారుతుంది. రక్తపోటు పెరిగి మనిషి స్పృహ కోల్పోతాడు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. పాము కోరల గాట్లు కన్పిస్తాయి. పొక్కులు, దద్దుర్లు వస్తాయి. నాలుక లావవుతుంది. నోటి నుంచి నురుగ వస్తుంది.

ఆందోళనతో ఎక్కువ ముప్పు



పాము కరిచిన వ్యక్తి ఎక్కువ ఆందోళన చెందొద్దు. లేదంటే బీపీ ఎక్కువై గుండెపోటుకు గురయ్యే ఆస్కారం ఉంటుంది. కొన్నిసార్లు విషం కంటే భయమే ప్రాణాంతకంగా పరిణ స్తుంది. ఆస్పత్రిలో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు ఉన్నాయి. పాము కరిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే రోగిని ఆస్పత్రికి తీసుకురావాలి. పసరు మందులు, మంత్రాలను నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా మసలుకుంటూ పనులు చేసుకోవాలి. మరుగు ప్రదేశాల్లో నేరుగా చేతిని పెట్టొద్దు. అక్కడ పాములు, తేళ్లు ఉండే అవకాశాలున్నాయి.

- డాక్టర్ గోపాల్, నవాల్గ పీహెచ్‌సీ



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

ఆమనగల్లు/తలకొండపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు శాఖ అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతోందని శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్ తెలిపారు. మంగళవారం డీసీపీ ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్‌లతో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేవారు. ఎన్నికల్లో భద్రతకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలింగ్ బూత్‌ను సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను సైతం డీసీపీ తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్టేషన్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సైలు ఎ.శ్రీకాంత్, కె.శేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వోతో మాట్లాడుతున్న నాయకులు

కస్తూర్బా పాఠశాల సందర్శన

మర్పల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి నాయకులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో వంట గది, నిత్యావసర సరుకులు నిల్వ చేసే, కంప్యూటర్ గదులను పరిశీలించారు. ప్రత్యేకాధికారితో మాట్లాడుతూ విద్యార్థులకు పురుగుల అన్నం ఎలా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్, నాయకులు బలరాంగౌడ్, యాదవరెడ్డి, శ్రీమంత్‌కుమార్, మధు, శేఖర్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తాం

- ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్,జూలై 15(ఆంధ్రజ్యోతి):తాండూరు ప్రాంతంలో మరోసారి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జినుగుర్తి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పి.శ్రీనివాస్ మెమోరియల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి పి.రాములు అధ్యక్షత వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన సోదరుడు రాజేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం జిల్లాలో ఏటా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాండూరులో 18 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని మాజీ మంత్రి తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. జినుగుర్తిలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.ఉత్తంచంద్ మాట్లాడుతూ.. జినుగుర్తి యువత క్రీడల్లో ఎప్పుడూ ముందుంటుందని, వారికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల సీనియర్ నాయకులు సంపత్‌కుమార్, కె.పురుషోత్తంరావు, పి.రాంలింగారెడ్డి, సాయిరెడ్డి, అంజనేయులు, భద్రేశ్వర్, హెచ్‌ఎం రవీంద్రకుమార్, నాగప్ప, శేఖర్, సత్యనారాయణ, రాములు, నర్సింహులు పాల్గొన్నారు. వాలీబాల్ క్రీడాకారులను కలిసి మహేందర్‌రెడ్డి పరిచయం చేసుకున్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఆమనగల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు తెలుపగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం రేషన్‌కార్డులిచ్చి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ కనుమరుగేనని అన్నారు. కార్యక్రమంలో కాసు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్, డాక్టర్ శ్రీను, వెంకటయ్య, సుమన్, మల్లేశ్‌గౌడ్, జగన్, రవీందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

సమాజాన్ని మార్చే శక్తి మీడియాకుంది

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమాజాన్ని మార్చే శక్తి మీడియాకు ఉందని, నిష్పాక్షికంగా వాస్తవాలను వెలుగులోకి తేవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్తలాప్ మీడియా వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రతికూల వార్తలతో కాకుండా సానుకూల వార్తలతో కూడా సమాజంలో మార్పు తీసుకు రావచ్చన్నారు. మీడియా ప్రతినిధులు తమ వ్యక్తిత్వం, సొంత అభిప్రాయాలను జోడించకుండా ప్రజల అభిప్రాయాలు, వాస్తవాలనే బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్రంలో వరి ఎక్కువ సాగవడానికి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమన్నారు. కేంద్రం నుంచి ప్రతీ కుటుంబానికి రూ.80వేలు అందుతున్నాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో కంటే మన రాష్ట్రంలోనే యూరియా ఎక్కువ వినియోగిస్తున్నారని, యూరియా ధరపై 90 శాతం సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మీడియా వారధిలా పని చేయాలన్నారు. వార్తలాప్ వర్క్‌షాప్ ద్వారా మీడియా మరింత ప్రజలకు చేరువ అవుతుందని భావిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్, డిప్యూటీ డైరెక్టర్ మానసకృష్ణకాంత్, ఎంఅండ్‌సీవో శివచరణ్, సీడీఏసీ ప్రాజెక్ట్ మేనేజర్ జగదీష్‌బాబు, ఎస్‌బీఐ ఏజీఎంలు విద్యాధర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేయాలి



దీక్ష చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి ఎన్కేపల్లిలో సర్వే నంబర్ 180లో దశాబ్దాలుగా పంటలు సాగు చేసుకుంటున్న రైతుల భూమిలో ప్రభుత్వం గోశాలఏర్పాటు చేయాలనుకోవడం సరి కాదని, నిర్వాసిత రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్కేపల్లి రైతుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా కార్తీక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సాగు భూముల్లో గోశాల ఏర్పాటు చేస్తే రైతులెలా బతకాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల్లో ఐక్యత దెబ్బతీసేందుకు కొందరికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నారని విమర్శించారు. అందరికీ ఒకే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, డి.అంజనేయులు, డి.వెంకటరెడ్డి, శ్రీహరియాదవ్, రవియాదవ్, శ్రీనివాస్, నరోత్తంరెడ్డి, అరవింద్, పరమేశ్, సునీల్ ఉన్నారు. కాగా మంగళవారం తొమ్మిదో రోజు రైతుల రిలే నిరాహార దీక్ష కొనసాగింది. భూమి పోయిన వారికి ఇళ్ల స్థలాలిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా రైతులు భీష్మిస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం కేపీవీ రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుర్మిద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకూడదని అన్నారు. త్వరలో కుర్మిద్ద పరిసరాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా, అంతకుముందు పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించే ప్రదేశాన్ని ఏసీపీ పరిశీలించారు. హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలి



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సతీశ్

శంషాబాద్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ అన్నారు. మంగళవారం సహకార సంఘం ఆవరణలో రైతులకు దీర్ఘకాలిక, పంట రుణం చెక్కులను పంపిణీ చేశారు. సంఘంలో నూతనంగా 14 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.1,35,00,000 అందజేశారు. పంట రుణం కింద 36 మంది రైతులు రూ.49,80,000 రుణం ఇవ్వనున్నామని, దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. డైరెక్టర్లు మేకల ప్రభుసాగర్, హీరేకార్ శివాజీ, పిండి లక్ష్మి కృష్ణారెడ్డి, ముదావత్ రెడ్యా, సంఘం కార్యదర్శి సురేందర్, సిరిటి విఠల్ రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడిని తీర్చిదిద్దుతాం



మినీ ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎన్ఆర్ఐ మానికారెడ్డి, డీఈవో సురేశ్‌మోహన్

యాచారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సర్కార్ బడిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వసతులు కల్పించి ఆదుకుంటామని ఎన్ఆర్ఐ మానికారెడ్డి అన్నారు. పిల్లలను విధిగా ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె దత్తత తీసుకున్నారు. ఈమేరకు మంగళవారం విద్యార్థులకు మినీ ల్యాప్‌టాప్‌లతో పాటు బ్యాగ్‌లు, బెల్టులు ఇతర స్టేషనరీ అందించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందనీ తమ దృష్టికి తేవాలని, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, బడిని మానికారెడ్డి దత్తత తీసుకొని వసతులు కల్పించడం అభినందనీయమని డీఈవో సురేశ్‌మోహన్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, హెచ్ఎం నరోత్తంరెడ్డి, మానికారెడ్డి తల్లిదండ్రులు రవి, కృప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా : ఎంపీ



మల్లు రవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటే పేదలకు భరోసా అని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే పేదలకు మేలు జరుగుతుందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రంలో పేదలకు భవిష్యత్‌పై భరోసా ఏర్పడిందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఎంపీ మల్లు రవి పర్యటించారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను నాయకులు ఎంపీ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వపరంగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సన్నదులు కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పేదలు ఆనందంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నాయని, స్థానిక ఎన్నికల్లో విపక్షాలకు తగిన గుణపాఠం తప్పదని, 90 శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లు రవిని నాయకులు సన్మానించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్సనాయక్, నాయకులు లక్ష్మణ్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌బాబా, ఆకాశ్‌గౌడ్, జహంగీర్ అలీ, బిక్కిపతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి జై

(ఐదో పేజీ తరువాయి)

600 మంది విద్యార్థులు ఉండగా.. బడిబాటలో 1,400 మంది వరకు చేరారు. శంషాబాద్ మండలం ముచ్చర్ల బడిలో 78 మంది ఉండే.. వీరి సంఖ్య 1,113కి చేరుకుంది. వేయి మందికిపైగా విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఫరూక్‌నగర్ మండలంలో 600 మంది పిల్లలు చేరారు. సింగరేణి కాలనీలోని బడిలో 25 మంది విద్యార్థులు ఎంతమో సహకారంతో చేర్పించారు. మహేశ్వరం మండలం కొళ్లపడకల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 23, ఉన్నత పాఠశాలలో 35 మంది చేరారు. కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో పీఎస్‌లో 20, హైస్కూల్లో 20 మంది చేరారు. శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి రవాణ సౌకర్యం కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. మంచాల మండలం ఎల్లమ్మ తండా స్కూల్ మూత పడింది. ఈ స్కూలును రీఓపెన్ చేయించారు. ఇందులో 66మంది పిల్లలు చేరారు.

ఇబ్రహీంపట్నంలో రోడ్లు అభివృద్ధి చేయండి

మంత్రి కోమటిరెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతూ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా సింగిల్ లేన్ రోడ్డును రెండు వరుసలుగా, రెండు లేన్లను నాలుగు వరుసలుగా మార్చాలని కోరారు. ఆయా రోడ్ల వివరాలను మంత్రికి వివరించారు. సుమారు రూ.383కోట్లతో పనులు నిర్వహించాల్సి ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో స్టేట్ రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కూడా ఉన్నారు.

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



షాబాద్ : అవగాహన కార్యక్రమంలో ఎస్సై శ్యాంసుందర్ కాలీలతో

షాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని, వారికి ఎల్లప్పుడూ రక్షణగా ఉంటుందని షీ టీం ఎస్సై శ్యాంసుందర్ అన్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామ సమీపంలో మంగళవారం కూలీలకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, దాడులను అరికట్టేందుకు షీ టీం పనిచేస్తున్నట్టు తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, మహిళల భద్రత, మహిళల చట్టాలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రవీందర్, మల్లేష్, రేష్మాబేగం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



కొందుర్గు పోలీసులతో మాట్లాడుతున్న సీఐ నరసయ్య

చౌదరిగూడ : విధులు సక్రమంగా నిర్వహించాలని షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం కొందుర్గు పోలీసులతో మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. డయల్ 100కు సమాచారం రాగానే వెంటనే స్పందించాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని చెప్పారు.

హస్తేపూర్ జీపీకి స్థలం వితరణ

● చేవెళ్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తైలాజిగిరిరెడ్డిల ఉదారత

● హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



హస్తేపూర్ జీపీ భవనం నిర్మించే స్థలం వద్ద నాయకులు, ప్రజాప్రతినిధులు

చేవెళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హస్తేపూర్ నూతన గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో చేవెళ్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బందారు తైలాజిగిరిరెడ్డిలు సొంత డబ్బులు వెచ్చించి 250 గజాల స్థలం కొనుగోలు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈమేరకు మంగళవారం ప్రజాప్రతినిధులతో కలిసి వెంకట్‌రెడ్డి, తైలాజిగిరిరెడ్డిలు స్థలాన్ని జీపీ అధికారులు, గ్రామస్తులకు అప్పగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హస్తేపూర్ నూతన గ్రామ పంచాయతీకి భవనం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం లేకపోవడంతో.. గ్రామస్తుల కోరిక మేరకు తాము ముందుకొచ్చి సొంత డబ్బుతో 250 గజాల స్థలం కొనుగోలు చేసి అప్పగించినట్లు తెలిపారు. దాంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చేవెళ్ల ఏఎంసీ వైస్‌చైర్మన్ బీరయ్య, మాజీసర్పంచ్ వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వసంతం, కావలి వెంకటేశ్‌బాబు, మద్దెల శ్రీనివాస్, పాష్, తరుణ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలి



ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్యకు వినతిపత్రం ఇస్తున్న శివాజీ

కేశంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్యకు, పింఛన్ అర్హులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెంటనే ఆసరా పథకంలో పింఛన్లను రూ.4వేలు పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. పింఛన్లను పెంచకపోగా అర్హులకు మంజూరు చేయలేదని తెలిపారు. శివగౌడ్, మణికంఠ, శ్రీనివాస్, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లగుట్ట తండాకు చెందిన కమ్లీ వాల్యా దంపతుల కుమారుడు వంశీ అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం మృతదేహాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు రాజేందర్ నాయక్, దేవేందర్, హరికిషన్, శ్రీను, భాను, లక్ష్మణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు అన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 255వ రోజుకు చేరాయి.

బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలి



ధర్నాకు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మంగళవారం బీసీ రిజర్వేషన్లపై నిర్వహించిన మహా ధర్నాకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ బీసీ నాయకులతో కలిసి అంజయ్యయాదవ్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరుతో బీసీలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. ఆర్డినెన్స్ పేరుతో ఆశలను రేకెత్తించి, బీసీల్లో గందరగోళాన్ని నెలకొల్పవద్దని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీ బిల్లును రాజ్యాంగసవరణ ద్వారా ఆమోదం లభించేలా చూడాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లుకు చట్టబద్ధతను కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని అంజయ్యయాదవ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కేశంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): తమ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు స్వగ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల పరిధిలోని అల్వాలకు చెందిన షకీల్ పటేల్, సమీర్ పటేల్, అల్తాఫ్ పటేల్‌లు తమ తండ్రి గులాం తాహెర్ జ్ఞాపకార్థం గ్రామంలో ఐదు వేర్వేరు ప్రాంతాలలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. గ్రామంలో ప్రజలు ఉపయోగపడేవిధంగా ఐదు ప్రదేశాలలో లైట్లు వేయించామని వారు తెలిపారు. పల్లెప్రకృతివనం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంగళవారం వారు ప్రారంభించారు. గ్రామానికి ఎంతో కొంత సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు సమీర్ పటేల్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశ్రి రవీందర్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లికి చెందిన బంగారిగళ్ల రాములుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కింద రూ.60వేలు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం సంకటోనిపల్లిలో బాధిత కుటుంబానికి రవీందర్ బాధితుడు రాములుకు చెక్కు అందజేశారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో వారి వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. మంత్రులను మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనతో పలువురు నాయకులు ఉన్నారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో యాదయ్య తదితరులు

కురుమ సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా పాండు



పాండును సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆకుల మైలారం గ్రామానికి చెందిన అచ్చన పాండును కురుమ సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పాండును అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు సత్తయ్య, ప్రభాకర్, మల్లేషులు తెలిపారు. పాండు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కురుమ కులం అందాల్సిన సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా పాలకులు కృషి చేయాలన్నారు. కురుమ సంఘాన్ని మండలంలో మరింత పటిష్టం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల గౌరవ అధ్యక్షులుగా ఎగ్గిడి సత్తయ్య, ఎగ్గిడి చిన్న ఐలయ్య, బక్క మల్లేష్, గౌర ప్రభాకర్, బండ నర్సింహ, సరికొండ జగన్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. త్వరలో మండల కమిటీని పూర్తిస్థాయిలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు ఎగ్గిడి కృష్ణ, మహేందర్, మేడి జంగయ్య, ఎమ్మెడి జంగయ్య, దొడ్డి కృష్ణ, ఏకుల మల్లేష్, దేవయ్య, మోటె రమేష్, శేఖర్, కండది శ్రీరాం, జగదీశ్, సత్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికకు ఐరన్ డోర్ వితరణ

కేశంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): తమ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత గులాం పరూఖ్ కుమారులు ముస్తఫా పటేల్, అశ్వక్ పటేల్‌లు వారి తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలోని రైతువేదికకు రూ.25వేలు ఖర్చుచేసి ఐరన్ డోర్ వితరణ చేశారు. రైతు వేదిక ప్రధాన డోర్ ఇటీవల ఈదురు గాలులకు విరిగిపోయింది. ఈక్రమంలో విషయం తెలుసుకున్న ముస్తఫా పటేల్, అశ్వక్ పటేల్‌లు డోర్ ఏర్పాటు చేయించారు. మంగళవారం రైతులు ఏవో చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు వారికి కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

ఓటరు జాబితా తయారీపై బీఎల్వోలకు శిక్షణ

తలకొండపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓటర్ల తొలగింపు, ఎన్నికల విధులపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వకుండా చేపట్టాలని సూచించారు. పరిశీలకులు మాదవరావు, శిక్షకులు లక్ష్మీనర్సింహారావు, రాజేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువతి అదృశ్యం.. కేసు నమోదు



హేమ్ కుమారి

శంషాబాద్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కేనరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన జితేంద్రకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్లక్రితం జీవనోపాధి కోసం శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లికి వచ్చి ఇక్కడే నివాసముంటున్నాడు. ఈ నెల 14న జితేంద్రకుమార్ తన తల్లి, సోదరుడితో కలిసి కూలి పనులకు వెళ్లారు. సోదరి హేమ్‌కుమారి వతుర్వేది ఇంట్లోనే ఉంది. ఆదేరోజు సాయంత్రం కూలి పనులు ముగించుకొని జితేంద్రకుమార్‌తో పాటు తల్లి, సోదరుడు ఇంటికి వచ్చి చూసేసరికి హేమ్‌కుమారి కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జితేంద్రకుమార్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్‌పై దాడి

బోరు వేసే విషయంలో గొడవ

చేయి చేసుకున్న ఏఎంసీ చైర్మన్ కుమారులు

చేవెళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): బోరు వేసే విషయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమారులు, మాజీ సర్పంచ్‌పై దాడి చేసినట్లు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఇందిరారెడ్డినగర్‌లో వేసవిలో నీటి సమస్య తలెత్తడంతో ముందస్తుగా ప్రభుత్వం బోరు మంజూరు చేసింది. దాంతో అధికారులు ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహం సమీపంలో బోరు వేసేందుకు స్థలం గుర్తించారు. మంగళవారం ఉదయం అధికారులు బోరు వేయడం ప్రారంభించారు. 100 మీటర్లలోతు వేసిన తర్వాత నాన్‌చెరువు మాజీ సర్పంచ్ అమరేందర్‌గౌడ్ అక్కడికి వచ్చి ఇక్కడ బోరు ఎందుకు వేస్తున్నారు అని ప్రశ్నించారు. కొద్ది దూరంలో వేయాలని మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు. అక్కడే ఉన్న చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ కుమారులు జైపాల్, ప్రభాకర్‌లు అమరేందర్‌గౌడ్‌తో గొడవకు దిగారు. మాటా మాటా పెరిగి మాజీ సర్పంచ్ అమరేందర్‌గౌడ్‌పై వారు ఇద్దరు చేయి చేసుకున్నారు. బోరు విషయంలో గొడవ జరగడంతో మిషన్ భగీరథ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని బోరు వేయించారు. అయితే, తనపై మార్కెట్ కమిటీ చైర్మన్ కుమారులు చేయి చేసుకున్నారని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో అమరేందర్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అయితే, ఈ విషయమై చేవెళ్ల మండల మిషన్ భగీరథ ఏఈ గీత వ్రతంతిని వివరణ కోరగా.. రాజకీయ గొడవలకు మాకు ఎలాంటి సంబంధం లేదని, వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం బోరు మంజూరు చేయడంతోనే నూతనంగా బోరు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. మాజీ సర్పంచ్ అమరేందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్టు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు.. 7 ట్రాక్టర్ల సీజ్

చౌదరిగూడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయ్ తెలిపారు. మంగళవారం ఎస్సై వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దాంతో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి మట్టి తరలిస్తున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఈమేరకు 7 ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కేశంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేశంపేట మండల పరిధిలోని దేవునిగుడి తండాకు చెందిన నేనావత్ శ్రీనివాస్‌నాయక్ ఫిట్స్‌తో బాధపడుతుండేవాడు. వ్యాధి నివారణకు మందులు కూడా వాడుతున్నాడు. ఈక్రమంలో వ్యాధి తీవ్రత అధికం కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 13న పశువుల కొట్టంలో పనులు చేస్తుండగా ఫిట్స్ వచ్చింది. బాధ భరించలేక కొట్టంలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు భార్య శ్రీనునాయక్ భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్..

మంచాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మంచాల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పసుల వెంకటేష్(39) గుండెపోటుతో మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడు వెంకటేష్ సోమవారం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండగా గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఆయన విధులు నిర్వర్తిస్తూనే జిల్లాస్థాయిలో క్రికెట్ ఆడేవాడు. దీంతో సమీప గ్రామాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో పరిచయం ఉంది. ఈమేరకు వెంకటేష్ మరణ వార్త తెలుసుకున్న స్నేహితులు, యువకులు మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్దఎత్తున పాల్గొని నివాళులర్పించారు.



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు తదితరులు

వివాదాస్పద భూమిలో నివాసం!

● ఖాళీ చేయాలని సూచించిన పోలీసులు

మాడ్గుల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల రెవెన్యూ పరిధిలో గల ఫిరోజ్‌నగర్‌లోని పలు సర్వేనంబర్లలో 180 ఎకరాల ఇనామ్ భూమి కలదు. అయితే, ఆ భూమి విషయంలో పట్టాదారులకు(ఇనాం) గ్రామస్తులకు గత ఐదేళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఇరువర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. మూడు నెలల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డీవో విచారించగా ఇనామ్ భూమిపై స్టేటస్‌కో ఇచ్చారు. కాగా, 5 నెలల క్రితం సర్వేనంబర్ 476లోని భూమిలో బాధ్యాదర్లు ఓ కంటైనర్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సీఐ వేణుగోపాల్ సిబ్బందితో కలిసి ఫిరోజ్‌నగర్‌కు చేరుకొని కంటైనర్‌లో నివాసముంటున్న వెంకన్న దంపతులను విచారించారు. అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని, వివాదాస్పద భూమిలో నివాసముండొద్దని సూచించారు. అయితే, సీఐ తనపై చేయి చేసుకున్నాడని, దుర్భాషలాడాడని వెంకన్న తెలిపారు.

ఘనంగా ఉప్పల మైసమ్మ బోనాలు



బోనాల వేడుకలో గ్రామస్తులు

షాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందన్‌వెల్లి గ్రామంలో ఉప్పల మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.